# కుండ బద్దలు కొడత

అది పెద్దవూరు. వూరిమధ్యన ఖాళీస్థలంలో రాతి స్థంభం. దాని చుట్టూరా అరుగు, ఓ వైపు చింతచెట్టు. మరో వైపు వేపచెట్టు, దసరా రోజు ఇక్కడ పందిళ్లు వేసి గొర్రెను నరుకుతారు. కాముని పండుగ రోజున యిక్కడ కామున్ని కాలుస్తారు. స్వరాజ్యం వచ్చిన్నుంచి పదిహేను అగష్టున, ఇరవై ఆరు జనవరిన ఇక్కడ జెండా ఎత్తుతారు. అందరూ ఆ స్థలాన్ని "జండాకాడ" అంటారు. గ్రామంలోని అన్ని సమస్యలకు యిక్కడే పరిష్కారం జరుగుద్ది. ప్రతి పంచాయతీకి సంబంధించిన వాదోప వాదాలూ జరుగుతాయి. ఆ రోజు జరిగే ఈ పంచాయతీకి జనం చాలా మంది వచ్చారు. పొద్దు బారెడెక్కింది. సూర్యునిలో చురుకు

దనం, ఎండలో వెచ్చదనం పెరుగుతోంది. పాతికేళ్ళ రంగమ్మ, అరవైఏళ్ళ ఆమె ముదుసలి అత్త ఇద్దరూ ఎండలోనే నిలుచున్నారు. దూరంలో ఆమె భర్త రాములు తలవంచి కూర్చుని, నేల మీద గీతలుగీస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

అనాడు రాముడి కొచ్చిన ఆపదలాంటిదే ఈనాడు ఈ రాములు కొచ్చింది. రెండూ ఆడవాళ్ళకు జరిగిన అన్యాయాలే. రెండూ అడవిలో జరిగిన అక్రమాలే. రాముడికి రాములు మధ్యన, ఎన్నో తరాల అంతరం వున్నా, సమస్య ఇంకా సజీవంగానే ఉంది. రాములుకు తన తండ్రి గుర్తొచ్చాడు.

పదియేనేళ్ళ క్రింద తన తండ్రి, తాటిమీద నుండి పడి చని పోగ, తల్లి బలవంతాన తాళ్లు ఎక్కడం నేర్చుకొని, నాటి నుండి నేటి వరకు తాళ్ళెక్కుతూ, కల్లును, ముంజలను, గేగులను అమ్ముకుని ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిచేసి, తనూ పెళ్ళి చేసుకున్నాడు. తిన్నా తినకున్నా, వున్నా లేకున్నా తల్లి ఆదరణతో, భార్య అనురాగంతో, చక్కగా చల్లగా సాగుతున్న సంసారంలో చిచ్చు లేపారు

పొద్దున తాళ్ళెక్కడానికెళ్లి, సందకాడ తిరిగొచ్చే వరకు నమ్మకం లేని దిన దిన గండపు బతుకులో, నిప్పులెందుకు పోసింద్రో రాములుకు అర్థం కాలేదు. అమ్మ సెప్పదు, భార్య సూపియ్యదు. ఎవరు తన భార్యపై చెయ్యేసింది! అనుకుంటూ చుట్టూ చూశాడు. అందరూ తననే చూస్తున్నట్టనిపించింది.

"సెప్పే సెప్పు: లేకపోతే నిన్ను నరికేత్తా" భార్యవేపే చూస్తూ అన్నాడు.

ఒక్కసారే అందరూ అతని వైపు చూశారు. భర్త మాటలు శరీరంలోని ప్రతి అణువుని కంపర మెత్తించగా, ఆమెకు పొంగి వస్తున్న దుఃఖాన్ని మింగుతూ, చీరకొంగుని నోటిలో కుక్కకొని అత్త వైపు జరిగింది.

కోడలి తల నిమురుతూ, "అన్నెం పున్నెం ఎరుగని నీకు సీతమ్మ సెరొచ్చే గదనె. ఏడవకు, జరిగింది జరిగినట్లు సెప్పు" అంది అత్త. అత్త స్పర్శతో ఆమె కొత్తశక్తిని పుంజుకుని—

ఇద్దరు కల్లుకని ఒచ్చిండ్రు "కల్లు మాట్లాడుకొని తాగిండ్రు. కొడి కూర తెచ్చుకొని తిన్నరు... యిగ పొయ్యే ముంగల..." దుఃఖంతో గొంతు పెగ ల్లేదు రంగమ్మకు. అంత వరకూ వింటున్న జనం ఒక్కసారే శ్వాస పీల్చారు,

అది విన్న రాములు ఒక్కసారే లాగి విడిచిన బాణంలా లేచి నిలచున్నాడు అతని కనుగుడ్లు రక్తాన్ని చిమ్ముతున్నాయ్. అది చూసి ఆ వూరి పెద్దగొల్ల—

"తొందరపడకు; యిటురా నీడకు" అంటూ రాముల్ని నీడకు తీసుకొచ్చాడు.

"వాళ్ళెవరో పేరు సెప్పు. వాళ్ళ తలల్ని ముంజకాయల్ని నర్కినట్టు నరికేస్త" అంటూ భార్యవేపు చూశాడు.

రంగమ్మకు తన భర్త చూపుల్లో కోపం, కసి కనిపించింది. తన నోట్లో కొబ్బరి, బెల్లం పెట్టి నోరుమూసి నవ్వుతూ చూసిన చూపుకు, జిట్టీతపండ్లు తిను, ముత్యాల కొడుకులు పుడతరు, అంటూ తనవాల్లో ఈతపండ్లు పోస్తూ చూసిన చూపుకు, ఎంత తేడా అనుకుంటూ మళ్ళీ చెప్పసాగింది వనుక్కుంటూ.

"అప్పుడాయన తాడుదిగి వాగెమ్మటొస్తుండు. గడ్డమీగ నిలబడి ఒకడు అటు చూస్తుండు. యింకొాడదేమో నా కోకబట్టి గుంజి రైకముడి యిప్పి..." చెప్పడం ఆపింది రంగమ్మ దుఃఖంతో కుమిలిపోతూ.

"ఆ యిప్పి..." అని పెద్దరెడ్డి రంగమ్మను చూసిన చూపుతో అక్కడున్న పెద్దలందరూ తమ చూపులను కలిపారు సరిగ్గా వాళ్ళ చూపు తన పాతివ్రత్యాన్ని రుజువు చేసుకోవడం కోసం సతీ అనసూయను నగ్నంగా వడ్డించమన్నప్పటి మన త్రిమూర్తుల చూపులాగుంది.

"సూపియి ఏంజేసింద్రో యిప్పి ఈ లోకానికి సూపియి. అందర్కి అక్కచెల్లెండ్లున్నరు" అంది అత్త రంగమ్మ ముఖంలోకి చూస్తూ

తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ ఆమె చూపించలేక మళ్ళీ తలవంచుకొని ఏడుస్తోంది. ఆమె కళ్ళనిండా నీళ్లు, ముక్కుల్లో తడి.

"పోయినేడు ఓట్లు ఏయ్యలేదని, తాళ్ళ గొలలన్ని కోసేసి మా నోట్లో మన్నుబోస్తిరి. మాకేముంది? తాటిచెట్టునే నమ్ముకున్న మేము దానిమీదనే ఆధారపడితిమి. తాడు మాకు తల్లి. కల్లుదాందే, నార దాందే, తాగేరేఖ దాందే, వుండేగుడిసే దానివాసమే. యిన్ని ముంజలమ్ముకొనో, యిన్ని గేగులమ్ముకొనో మా బతుకు మేం బతుకుతుంటే, మీ కెందుకింత పగ? మీ భూముల పంచియ్య మంటిమా? చెట్లరకం ఎగ్గొడితిమా? అట్లజేసి అట్ల బతకనియ్య నైతిరి. ఇయ్యాలనేమో ఇట్లజేస్తిరి. మరి వూళ్ల వుండాల్న

పోవాల్న మనం నోరు మూసుకుంచే ఇట్ల జేస్తరు. సుపియి... సుపియి" అంది కోడలి మోహంలోకి చూస్తూ.

అత్త మొండి ధైర్యం ఆమె గుండె నిండా నిండుకోగా చూపుల్లో తెగింపు చోటుచేసుకుంది. అత్త కళ్ళలో నుండి ఏదో ధైర్యం రంగమ్మ కళ్ళలోకి చొచ్చుకొని పోగా కొత్తశక్తి, సత్తువతో ఆమె కొంగు తొలగించి రవికముడి విప్పి గ్రామ పెద్దలకు చూపించింది.

భర్త కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నవి.

అత్త గుండెలో అగ్గి రగిలి ముఖంలో రోషం సెగలు పొగలుగా పొంగుతుంది.

గ్రామ పెద్దలు ఆమె ఎదమీద కొరికిన కాట్లను చూశారేకాని, ఎదలోని బాధని, వేదనని అంత గ్రహించినట్లు లేరు. కౌరవ సభలో ఆనాడు ద్రౌపదిని చూసినట్టు ఈనాడు రంగమ్మను చూస్తున్నారు.

భయంతో వణుకుతున్న చేతులతో దుఃఖంతో అదురుతున్న పెదాలను మూసుకుంటూ- "నేను తప్పించుకునేందుకు సూసిన. అయినా అదిమిపట్టి రవికను సింపి నోటితో కరిసిండు" అంటూ భోరున ఏడ్చింది ఒక్కసారే.

రాములునెవరో కొరడాతో కొట్టినట్టనిపించింది. గుండెలోవిబాధ కన్నుల్లోకి తన్నుకురాగ చుట్టు చూసి పల్లు పటపట కొరికాడు.

"అంతలోనే ఆయన ఒస్తున్న చప్పుడైంది. ఒక్కసారే కేకేసిన, మరీ దగ్గరికొచ్చిన ఆయన్ని చూసి ఉర్కిన" అంటూ తన ఒంటిగాయాలను చిరిగిన కొంగుతో కప్పుకుంది.

"ఇది ఏమి అన్యాయం? యిగ జెప్పండ్రి ఏంన్యాయం చెప తారో" అంది అత్త.

"బాగా తిని దున్నపోతులా తిరిగితే ఎట్లా? మంది సంసారాలను గూడా చూడాలి" జనంలో నుంచి ఓ గొంతు.

"కన్ను మిన్ను గానకుండా తాగితే ఎట్లా? దాన్ని మనం తాగుతమా? మనల అది తాగుద్దా?" మరో గొంతు ఆవేశంతో.

కొంగు జారి, రవిక చినిగి, రాబందులు పొడిచిన శవంలా వుంది రంగమ్మ.

"తాగినోళ్ళంతా మంది పెండ్లాల గుంజుతుండ్రా" ఓ ముసలమ్మ.

"చెప్పండ్రి? చెట్టంత కొడుక్కు ఈ బదునాము ఏంది?" అంది అత్త

"ఇంతకూ ఆపని చేసిందెవ్వరు? అన్ని సూపియరేమి?" అడిగాడు ఆ వూరి పెద్దరైతు.

"అదే అంటున్నం మేమం. తప్పుగూర్చే సెప్తున్నరుగాని, ఆ తప్పు చేసిందెవ్వరో సెప్పరేమి?" అన్నారు మరికొందరు.

ఎవరైందీ తనకు తెలిసినా కోడలిద్వారా చెప్పించాలని అత్త ఆరాటం.

రంగమ్మ బిక్కు బిక్కు మంటూ అందరివైపు చూసింది.

"వాళ్ళిద్దరూ కనిపించలేదు. చుట్టూ మరోసారి కలియ చూసింది; లేరు. తలదించుకుంది, కన్నీరు చుక్కలు చుక్కలుగా నేలమీద పడుతున్నవి.

"దొర కొడుకని వొదిలి పెట్టొద్దు. ఇయాల ఇది, రేపు ఇంకోటి" అంది అత్త.

దొరకొడుకనే సరికి గుస గుసలు బయలుదేరినవి. ఏదో చర్చ, ఏవేవో నిర్ణయాలు.

"ఏదొర కొడుకు?" ఖంగుమన్నది. రాములు గొంతు ఆవేశంగా

"యిదో గోవు. ఏడవడం తప్ప నోరిప్పదు" అంటూ చేయితో కోడల్ని చూపించింది అత్త.

అక్కడవున్న దొరల గుండెల చుట్టూ కందిరీగలు ముసిరి నట్లనిపించింది.

"మరి నీ కెరికుంటే ఎవ్వరో సెప్పరాదు?" నాలుగైదు యువ గొంతులు అత్తనుద్దేశించి.

"సెపుతా! ఎందుకు సెప్పను? ఎంకెస్వరావు కొడుకు" అక్కడే. కూర్చున్న రావును చూపిస్తూ.

ఒక్కసారే పిడుగు పడ్డట్టనిపించింది వెంకటేశ్వర్రావుకి.

రాములు కళ్లు రక్తాన్ని చిమ్ముతున్నవి. ఓ సారి చుట్టూచూశాడు.

"వూరి నేలమని ఒట్లేసితే, నీ కొడుకు మంది ఆడోళ్ళను గుంజితే ఎట్లదొర" ఓ మధ్య వయస్కుని ప్రశ్న.

వెంకటేశ్వర్రావుకి నోట్లో తడారిపోయింది. చెమటలు కమ్ము కుని గొంతు పెగలడం లేదు.

"మీ ఆడోళ్ళ ఇండ్లల్లో నైరి, అల్లను ఎవ్వరూ గుంజరు. మరి మేము కల్లు అమ్ముకునేవాల్లమైతిమి. ఏదేదో బాధలతో వొచ్చి కల్లు తాగుతరు. అపుడు మీతోటి అమాట ఈమాట మాట్లారుతూ, బావని, మావని, మరిదని మాట్లాడినంత మాత్రాన, అందరూ రంకు లాడాలా? కల్లు అమ్ముడు పోవాలని మంచిగ మాట్లాడితే లంజోల్లమా? సెప్పుండ్రి, మీరే. నాయం సెప్పుండ్రి!" రామ్మ

చరుచుకుంటూ చుట్టూ తిరిగి అడుగుతోంది అత్త.

జనం ముసిల్దాని ధైర్యాన్ని మెచ్చుకుంటున్నారు.

పంచాయతీలో కూర్చున్న పెద్దలు వెంకటేశ్వర్రావు వైపు చూసి "మీ కొడుకును పిలిపించండి" అన్నారు.

వెంకటేశ్వర్రావు వాళ్ళ మొహంలోకి చూశాడు. అందరూ తప్పదు అన్నట్లు చూశారు.

బరువైన శ్వాసను పీలుస్తూ మసుకూరి వైపు చూసి "నువ్వూ కవలాయన వెళ్ళి వాన్ని తీసుకురండి" అన్నాడు.

యింతవరకు నేలమీద గీతలు గీసిన రాములు తన చేతిలోని కట్టెపుల్లను రెండుగ యిరిచిపారేసి, వెంకటేశ్వర్రావు వైపు చూశాడు.

అదే సమయంలో రాములును చూస్తున్న వెంకటేశ్వర్రావుకు తన కొడుకును రెండు ముక్కలుగ యిరిచినట్లనిపించి పెద్దరెడ్డి వైపు చూసి తల దించుకున్నాడు.

చేతికర్రతో మసుకూరి, కావలికాడు గొంగళి సర్దుకుంటూ ఇద్దరూ అక్కడ్నుంచి కదిలారు.

"న్యాయం అనేది అందర్కి సమానమేనా? ఏమన్న భేదం ఉందా" అంటూ లేచి నిలుచున్నాడు రాములు.

అందరూ అతని వైపు చూశారు.

వెంకటేశ్వర్రావూ అతని వైపు చూశాడు. తను కనిపిస్తే దండం దొరంటూ చేతులు జోడించే రాములు ఈ రోజు పంజావిప్పి పైకొస్తున్న పులిలా కనిపించాడు. కళ్ళుమూసి కణతలను ఎడమ చేతితో వత్తుకున్నాడు. అతని చేతిలోని కొడవలితో ముంజకాయ

ని ను నరికినట్టు తన కొడుకును నరికినట్టు కనిపించింది. వెంటనే కళ్ళు తెరచి అటు ఇటు చూసి కదలి కూర్చున్నాడు. శరీరం అంతా చెమటతో తడిసింది.

రాములు కళ్ళలోని నిప్పు రాజుకుని మంటలు లేస్తున్నవి. అది గ్రహించిన కొందరు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"ఎవరు చేసినా తప్పు తప్పే! తప్పన్నంక చికిత్స వుండాలిగా? దొరకొడుకైతేంది? కూలోడి కొడుకైతేంది?" పెదరెడ్డి ప్రకటన.

"ఇద్దరు అన్నవుగదా! యింకొకడు ఎవరు? ఆని పేరు చెప్పరూ?" అడిగారు అక్కడున్న యువకులు అత్తకోడళ్ళను ఉద్దేశిస్తూ.

"ఇంకొకడెవరు? పెదరెడ్డి కొడుకు" అంది అత్త.

పెదరెడ్డి మొహం గాలి తీసిన ట్యూబులా అయింది. అందరూ పెదరెడ్డికేసి చూశారు.

తన వేపు చూస్తున్న వెంకటేశ్వర్రావుని చూశాడు పెదరెడ్డి.

ఊళ్ళో సింహాల్లా తిరిగే పీళ్లు సుడిగాలిలో చిక్కిన ఎండు టాకులు అయిపోయారు.

"వాన్నిగూడా పట్టుకరండి" అనడంతో అక్కడున్న నలుగురు యువకులు కబడ్డి ఆటలో కూతపెట్టేవాణ్ని పట్టకోవడానికి పోయినట్టు ఒక్కసారే జట్టుగ వెళ్ళారు.

అక్కడంతా గుసగుసలు ముసురుకున్నవి. కొందరు కళ్ళు పద్దగ చేస్తే, మరికొందరు చెవులు పెద్దవి చేస్తున్నారు. ఆడవాళ్లు మాతులు తిప్పుతూ ముక్కుమీద వేలేసుకుంటున్నారు.

"చూడు్రి! మీరు సిగిత్స చేయకుంటే నేను

కుండ బద్దలు కొడత! నలభయి యేండ్ల నుంచి నా కడుపుల దాగినయన్ని కక్కేస్తా! అప్పుడుసూడు ఎన్ని సంసారాలు గంగ పాలు గావాల్నో" గుండె చరుసుకుంటూ అంది అత్త.

ఆ మాటలు వినగానే అక్కడున్న కొందరి అడవాళ్ళ నడికట్లు బిర్రైనై కొంగులు జారినవి. మగాళ్ళు కొందరు కదిలి సర్దుకుని కూర్చున్నారు. కొందరు చుట్టలు ముట్టించుకున్నారు. చడీచప్పుడు లేదు. జండాకాడంతా నిశ్శబ్దం ఆవరించింది. తీసుకురావడానికెళ్ళిన మసుకూరి, కావలాయనే కాకుండా ఆ నలుగురు యువకులూ తిరి గొచ్చి "వాళ్ళు యిండ్లల్లో లేరు". అన్నారు.

"ఆలెక్కడ వుంటరు? ఉండరు! దొంగకొడుకులైరి" పెదరెడ్డిన్ని, వెంకటేశ్వర్రావును మార్చి మార్చి చూస్తూ అన్నాడు రాములు.

వాళ్ళు లేంది తీర్మాణం ఎలా జరుగుద్దన్నట్లు? అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"లేకుంటే ఎక్కడపోతరు? మందిండ్లకు నిప్పెట్టి మహారాజుల్లా కూర్చుంటెట్లా" దొరలంటే పడనివాళ్ళు ఉద్రేకంతో ఊగుతున్నారు.

"ఏదో తాగి అట్ల జేసిండ్రుగాని అంతకు మించిన తప్పేం సెయ్యలేదు గదా!" దొరల సంకనాకేవోళ్ళు.

ఆ మాటలు విన్న అత్త— "పేదోని పెండ్లం అందరికీ మరదలు! మీ ఇండ్లల్లో ఆడోళ్ళకు యిట్ల జరిగితే వూకుంటర? మీ ఆడోళ్ళందరూ పతివతలేనాయె! ఈ వూరు సంగతి, వూళ్ళోల్ల సంగతి నాకు బాగానే ఎరుక, ఏతాటికల్లు ఏదొంసానికి ఏజీతగాడు మోసిండో, ఏ జీతగాడు తాగిన పైకం కింద ఏ దొరసాని గింజలు కొలిసిందో అన్నీ ఈ పొట్టలో వున్నయి. ఏతలప్పుడు,

కోతలప్పుడు, నాట్లప్పుడు ఎవరెవరు ఎవరెవరికి కల్లు పోపిచ్చిం ద్రో, ఎవరి పురుడు ఎవరు చేయించేదో సెపితే, ఎందరి పుటకలు బయట పడతయో చూడింద్రా" అంటూ వూగిపోతున్న ముసలమ్మను ఓ అవ్వ చెట్టుకిందకు తీసికెళ్లి కూర్చోబెట్టింది.

నేరస్థులు లేరు కాబట్టి పంచాయతివి రేపటికి వాయిదా వేస్తున్నా మని లేచారు గ్రామ పెద్దలు.

ఓ పదేళ్ళ పిల్లవాడు వగురుస్తూ పరుగెత్తుకొచ్చి—

"ఆ ఇద్దరూ మా ఇంటి సందులనిచ్చి పోయి, ఆందంచే న్ల దాక్కుంద్రు" అంటూ తన ఎడమ చేతితో ఆముదపు చేను ఉన్న దిక్కును చూపించాడు.

"ఏదీ సూపిద్దువు పా" అంటూ వూ రేంబడేవున్న ఆముదపుచేను వైపు పరిగెత్తుతున్న రాములును అనుసరించారు అందరూ.

వెంకటేశ్వర్రావు, పెదరెడ్డి ఒకరినొకరు చూసుకుంటూ ఆలో చనలో పడ్డారు.